RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 227 | ఆగస్టు 06, 2025 | వెల : రూ.3-00



**మహిళ పట్ల అసభ్యకరంగా వ్యవహరించిన వ్యక్తి రిమాండ్**

3లో..

# వెల్ఫేర్‌ను ఆపం

**- అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం - మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

**వేద న్యూస్, ఖమ్మం:**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగో లేకపోయినా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఆపేది లేదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గత పాలకుల హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ.లక్షల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని.. కమిషన్ నివేదిక ప్రభుత్వానికి అందజేసిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లో జరిగిన అవినీతి పైన అసెంబ్లీలో చర్చిస్తామని వెల్లడించారు. బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బుర్ర రాజశేఖర్, జొన్నలగడ్డ రవికుమార్, కూసుమంచి మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు బొల్లంపల్లి సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





**అభివృద్ధి పనులు**

# మొదలుపెట్టాలి

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**
**- అంజన్న ఆలయ అగ్రహారం పరిశీలన**

**వేద న్యూస్, వేములవాడ:**

అంజన్న ఆలయంలో అభివృద్ధి పనులు మొదలు పెట్టాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ మండలం అగ్రహారంలోని హనుమాన్ ఆలయం వద్ద రూ.31 లక్షలతో ఆర్చి, ప్రాకారం సాలహారంతో కలిసి, కమాన్ నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మంగళవారం ఆలయం వద్ద పరిశీలించి ఆలయ ఈవో శ్రీనివాస్ నకు, అధికారులకు పలు సూచనలు చేశారు. సిరిసిల్ల -కరీంనగర్ ప్రధాన రహదారి మధ్య నుంచి 50 ఫీట్ల దూరం నుంచి ఆర్చి, ప్రాకారం సాలహారంతో కలిసి, కమాన్ నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. టెండర్ ప్రక్రియ ఇటీవల పూర్తి అయిందని వెల్లడించారు.

# మరీ ఇంత నిర్లక్ష్యమా..!

**-జిల్లా ఆస్పత్రిలో రేడియాలజీ (స్కానింగ్ ) డాక్టర్ ని నియమించాలి**

**వేద న్యూస్, పార్వతీపురం మన్యం ప్రతినిధి :**

పార్వతీపురం మన్యం జిల్లా ఆసుపత్రి పై మరీ ఇంత నిర్లక్ష్యమా...? అని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నించారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ పార్వతిపురం మన్యం జిల్లా ఓబీసీ చైర్మన్ వంగల దాలి నాయుడు, జిల్లా నాయకులు

మిగతా 2వ పేజీలో..



## నేటి నుంచి రాష్ట్ర కురుమ సంఘంలో క్రీయాశీల సభ్యత్వ నమోదు

**వేద న్యూస్, వరంగల్ :**

తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అదేశానుసారం జిల్లాలోని కురుమలు ఐక్యత కోసం కురుమ సంఘం సభ్యులుగా చేరేందుకు సభ్యత్వ నమోదు కార్యాక్రమాన్ని చేపట్టారు. వరంగల్ జిల్లా ఇన్‌చార్జీ కోరే కృష్ణ ఆధ్వర్యంలో వరంగల్ అండర్ రైల్వేగేట్ ప్రాంతం రంగశాయిపేటలో ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జినుక రమేష్ ఆధ్వర్యంలో కురుమ సంఘం సభ్యత్వ నమోదు కార్యాక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ సంఘ సభ్యత్వం కోసం ఆసక్తి గల కురుమ కులస్తులు రంగశాయిపేటలో జరుగు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కురుమ కులస్తులు పెద్ద ఎత్తున్న పాల్గొని సభ్యత్వం నమోదు చేసుకోవాలని జినుక రమేష్ కోరారు.

## ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం

**మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి**

2లో..

# ‘చెత్త’ శుద్ధి మరిచారు!





- **పారిశుధ్య నిర్వహణపై ఎవరికీ పట్టింపు లేదా?**
- **చెత్తకుండీలను కాదని బహిరంగంగా వెదజల్లుతున్న పబ్లిక్!?**
- **జనం తమ బాధ్యత మరుస్తుండటం సబబేనా?**
- **ప్రస్తుత వానాకాలం సీజన్‌లో పొంచిన ముప్పు**
- **జనావాసాల మధ్య వెలిసిన పిచ్చి మొక్కలను తొలగించరా?**

**వేద న్యూస్, వరంగల్:**

వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని 40 వ డివిజన్ పరిధిలో కరీమాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను కనీసంగా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ‘చెత్త’ తొలగించాలనే చిత్త ‘శుద్ధి’ మున్సిపల్ వారికి లోపించిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. డివిజన్ పరిధిలో ఎక్కడ చూసినా చెత్తనే కనిపిస్తోందని, ప్రస్తుత వానాకాలం సీజన్‌లో అనారోగ్య ముప్పు పొంచి ఉన్నా నిర్లక్ష్య వైఖరిని కనబరుస్తున్నారని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్యం పడకేస్తే.. తమకేంటనే కొందరు సిబ్బంది తీరు సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. రోడ్లపైన బహిరంగంగా చెత్తా చెదారం దర్శనమిస్తున్నా సిబ్బందికి కనిపించడం లేదా? అనే అనుమానాన్ని మరికొందరు డివిజన్‌వాసులు వ్యక్తం చేస్తున్నారు. జనావాసాల మధ్య పిచ్చి మొక్కలు విపరీతంగా



ఉన్నాయని, ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ఆ చెట్ల నుంచి దుర్గంధం వస్తోందని కొందరు కాలనీవాసులు చెబుతున్నారు. వెంటనే మున్సిపల్ సిబ్బంది చెట్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు. దుర్గంధపూరిత పరిసరాల వల్ల దోమలు వృద్ధి చెంది సమీప భవిష్యత్తులోనే డివిజన్‌లోని మొత్తం ప్రజలందరూ అనారోగ్యం బారిన పడే పరిస్థితులు ఉంటాయని పలువురు హెచ్చరిస్తున్నారు. మూకుమ్మడిగా జనం అనారోగ్యం బారిన పడి ఆస్పత్రులపాలు అయితేనే స్పందిస్తారా? అని ప్రశ్నిస్తున్నారు.

**- పబ్లిక్‌కు రెస్పాన్సిబిలిటీ ఉండనక్కర్లేదా?**

పైన పేర్కొన్న సంగతులు అలా పక్కనబెడితే.. పబ్లిక్ విధిగా చెత్తను చెత్త కుండీలో లేదా రోజువారీగా సేకరణకు వచ్చే సిబ్బందికి అందజేయాలి. కానీ, అలాకాకుండా తమకేమీ పట్టింపు లేదన్నట్టుగా ఇష్టారాజ్యంగా ఖాళీ ప్రదేశాల్లో కొందరు పడవేస్తున్నారు. అలా పడవేయడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే, అలా చేసే వారిని గుర్తించి వారికి అవగాహన కల్పించాలని, జనంలో చైతన్యం తీసుకురావాలని, అధికారులు ఆ దిశగా కృషి చేయాలని కొందరు సూచిస్తున్నారు. అన్ని పనులు ప్రభుత్వమే చేయాలి.. తాము మాత్రం తమకు నచ్చినట్టుగా ఉంటాం అనే రీతిలో పబ్లిక్ వ్యవహార సరళి కొంత మేరకు ఉండటం పద్ధతి కాదని వెల్లడిస్తున్నారు. బాధ్యతాయుతమైన పౌరులుగా ప్రతి ఒక్కరూ తమ పరిసరాల పరిశుభ్రతపైన దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

**- దుర్గంధమయంగా పరిసరాలు**

మురికి కాలువలలో మురుగు విపరీతంగా పేరుకుపోయి .. పరిసరాలు దుర్గంధమయవుతున్నా మున్సిపల్ వారు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ప్రతిరోజూ పారిశుధ్య నిర్వహణ చేయాల్సిన వారు చేయడం లేదా?.. లేదా రోజూ చెత్త సేకరణ జరగడం లేదా..? అసలు లోపం ఎక్కడుం ది? అనేది గుర్తించాలని పలువురు సూచిస్తున్నారు. ఒకవేళ ఇండ్లలో చెత్త పెరుగుతున్నదా? వారు నిర్లక్ష్యపూరితంగా ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారా? వారికి అవగాహన కల్పించడంలో అధికారులు ఎందుకు చొరవ చూపించడం లేదు? వంటి ప్రశ్నలకు అధికారులు సమాధానం కనుగొనాలి. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించేలా అధికారులు వారిలో చైతన్యం తీసుకురావా లని కొందరు పేర్కొంటున్నారు. ప్రస్తుత వానాకాలంలో పారిశుధ్య నిర్వహణ అత్యంత కీలకమని, ప్రజల ప్రాణాల సం‘రక్షణ’కు అది ముఖ్యమని నగరవా సులు చెబుతున్నారు. బల్దియా పారిశుధ్య నిర్వహణలో విఫలం కాకుండా ఉన్నతాధికారులు మార్గదర్శనం చేయాలని, ప్రతిరోజూ చెత్తను క్లీన్ చేసేలా వారికి సూచనలు చేయాలని కోరుతున్నారు.

వేద న్యూస్

బుధవారం ఆగస్టు 06, 2025

# పెన్షన్లు పెంచాలనే డిమాండ్‌తో మహాసభ

## - ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ - మీటింగ్ సక్సెస్ చేయండి: మండల ఇన్‌చార్జి అనిల్

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

ఈనెల 7న(గురువారం) హసన్ పర్తి మండలం లోని చింతగట్టు క్రాస్ దగ్గర ఎంపీఆర్ గార్డెన్‌లో వికలాంగుల, చేయూత పెన్షన్‌దారుల పెన్షన్లను పెంచాలనే డిమాండ్ తో మహా సభ జరగనుంది. ఈ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హాజరవుతారని ఎమ్మార్పీఎస్ ఎల్కతుర్తి మండల ఇన్ చార్జి అడ్డూరి అనిల్ మాదిగ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 6 గ్యారంటీలలో ఒకటైన వికలాంగుల , వృద్ధుల , వితంతువుల , ఒంటరి మహిళల , చేనేత , బీడీ , గీత కార్మికుల పెన్షన్లు పెంచుతామని రేవంత్ రెడ్డి మాట ఇచ్చారని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. లేనిపక్షంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వికలాంగులకు రూ. 4000 నుంచి రూ.6000 పెన్షన్ పెంచుతానని, వృద్ధులు , వితంతువులు , ఒంటరి మహిళలు , చేనేత , బీడీ , గీత కార్మికులకు రూ.2000 నుంచి రూ.4000 చేస్తానని చప్పారని గుర్తు చేశారు.

అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఒక్క రూపాయి పెన్షన్ పెంచకపోగా, నాలుగు నెలల పెన్షన్ ఎగ్గొట్టారని, పెన్షన్ దారులను నమ్మించి మోసం చేశారని విమర్శించారు. పెన్షన్లు పెంచి ఇచ్చే వరకు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో పెన్షన్ దారులందరినీ ఐక్యం చేసి పోరాటం చేస్తామని దానిలో భాగంగానే ఈనెల 13న ‘చలో హైదరాబాద్’ పేరుతో లక్షలాది మందితో వికలాంగుల చేయూత పెన్షన్ దారుల మహా గర్జన ఉంటుందని వెల్లడించారు. దాన్ని విజయవంతం చేయడంలో భాగంగా ఈ నెల 7న జిల్లా మహాసభను నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి మండల పరిధిలోని ప్రతి గ్రామం నుండి



వందలాదిగా వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, బీడీ, గీత కార్మికులు పెన్షన్ దారులు, కండరాల క్షీణతతో పూర్తిగా మంచానికి పరిమితమైన వికలాంగులు అందరూ సభకు విచ్చేసి విజయవంతం చేయాలని అనిల్ మాదిగ కోరారు.

# ప్రత్యేక అధికారి జూనియర్ కాలేజీ సందర్శన

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**




ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రత్యేక అధికారి రమణారావు మంగళవారం ఇల్లంతకుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలని సందర్శించారు. ఆయనతో పాటు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డీఐఈఓ శ్రీనివాస్ ఉన్నారు. వారు తరగతులను సందర్శించి, బోధన విధానాలపై సమీక్ష చేపట్టారు. విద్యార్థుల హాజరు, అకడమిక్ రికార్డుల నిర్వహణ, డిజిటల్ తరగతుల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. తరగతుల్లో బోధన పద్ధతులను నేరుగా గమనించి, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులతో జరిగిన ముఖాముఖి సమావేశంలో ప్రత్యేక అధికారి విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ, చదువుపై దృష్టి కేంద్రీకరించాలనీ, ప్రభుత్వ వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలనీ సూచించారు. క్రమశిక్షణతో మెలిగి, సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని కోరారు. విద్యే జీవితాన్ని మారుస్తుందని, అందుకే ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి పెట్టాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజం కృషిని ప్రత్యేక అధికారి అభినందించారు. విద్యార్థుల ప్రగతికి ఆయన తీసుకుంటున్న చర్యలు, కళాశాల పరిపాలనలో చూపుతున్న నిబద్ధతను ప్రశంసించారు. అధ్యాపకుల బోధనను నేరుగా పరిశీలించిన అధికారులు, సాంకేతికతో కూడిన బోధన చేయాలని సూచించారు. విద్యార్థులలో విజ్ఞానం, నైతికత, సామాజిక విలువలను పెంపొందిస్తూ, వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న అధ్యాపక సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.కార్యక్రమం లో అధ్యాపకులు నయీమొద్దిన్, సతీష్ రెడ్డి, మల్లారెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ స్థాయి పోటీకి యువతను సిద్ధం చేయాలి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**



జ్ఞానం, సాంకేతికత, నైపుణ్యాలు కలిపి ఉన్నవారే ప్రపంచ పోటీలో గెలవగలరని, అందువల్ల విద్యావ్యవస్థ కూడా భవిష్యత్‌కు అనుగుణంగా మారి ప్రపంచ స్థాయిలో పోటీకి యువతను సిద్ధం చేయాలని అన్నారు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ జి. బాలకిష్టా రెడ్డి. హైదరాబాద్‌లోని గవర్నమెంట్ సిటీ కాలేజ్ (ఆటానమస్), కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగం అప్రెంటిషిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రాములపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, ఒకే ఒక్క అధ్యాపకుడు వేలాది మందికి ప్రేరణనిచ్చే శక్తి కలిగి వుంటాడని, ఉన్నత విద్యారంగంలో వేగంగా చోటుచేసుకున్న మార్పులను అధ్యాపకులు అవగాహన చేసుకుని తదనుగుణంగా విద్యార్థులను భవిష్యత్తు దిశగా నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ విద్యా విధానం 2020 భారత విద్యారంగంలో గేమ్‌చేంజర్‌గా నిలిచిందని, విద్యార్థి మూర్తిమత్వ వికాసానికి బహుశాఖీయ అభ్యాస విధానాలను ప్రవేశపెట్టి విద్యార్థులను ప్రపంచ స్థాయిలో పోటీకి సిద్ధం చేయడంలో కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. భారత జనాభాలో 65 శాతం యువతే అని గుర్తుచేస్తూ, దేశాభివృద్ధికి ఈ యువశక్తిని విద్యా వ్యవస్థ ఉపయోగించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎఇడిపి ప్రోగ్రాముల ద్వారా విద్యార్థులకు ‘చదువుతూ సంపాదించే’ అవకాశం దొరుకుతుందని, ఇది విద్యార్థుల ఉద్యోగావకాశాలను పెంచడమే కాకుండా, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందన్నారు. నేడు సమాజంలో అవకాశాలకు కొదవలేదని మెరిటైమ్ సెక్టార్ ఇచ్చిన నివేదిక ప్రకారం నైపుణ్య, నైపుణ్యేతర ఉద్యోగాలు లక్షలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాలను వినియోగించుకోవడానికి తమను తాము సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.బాల భాస్కర్ మాట్లాడుతూ సిటీ కాలేజీలో 2021లో ఒక్క ఎఇడిపిని ప్రారంభించి, ఈ సంవత్సరం ఐదు ఎఇడిపిలను అందిస్తున్నామని అన్నారు. రిటైల్ ఆపరేషన్స్ విద్యార్థులు మూడు సంవత్సరాల కాలంలో పరిశ్రమలలో పనిచేస్తూ కోటి రూపాయల వరకు సంపాదించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా ఐపిఈ డైరెక్టర్ ప్రొఫెసర్ మూర్తి, కాలేజీ ఐక్యూయేసి కోఆర్డినేటర్ డా.జె.నీరజ, కార్యక్రమ సమన్వయకర్తలు డా.మల్లికార్జున్, డా.ఝాన్సీ, డా.రవీంద్ర, ఇఫత్ ఉన్నీసా, డా.శిరీషా, డా.రామారావు, లలిత చైతన్య, రాష్ట్రంలోని వివిధ డిగ్రీ కాలేజీలలో పని చేస్తున్న నలభైమంది అధ్యాపకులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం

## - మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి

**వేద న్యూస్, హన్మకొండ :**

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు రెండవ రోజు హనుమకొండ రామ్ నగర్ లోని తమ నివాసంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజలు రాంనగర్ లోని తమ నివాసానికి చేరుకుని తమ సమస్యలను మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సంబంధిత అధికారులతో అప్పటికప్పుడే ఫోన్లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. మరోసారి బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించినట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలకు వెనకాడనని కొండా మురళి వారికి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం దిశగా అధికారుల నుంచి సరైన స్పందన లేని పక్షంలో తనకు తెలియజేయాలని వారికి సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని కొండా మురళి స్పష్టం చేశారు.



# కాంగ్రెస్‌వి దిగజారుడు పాలిటిక్స్




## - మాజీ జెడ్పీటీసీ శ్రీరామ్ శ్యామ్

**వేద న్యూస్, జమ్మికుంట:**

కాంగ్రెస్ సర్కారు దిగజారుడు రాజకీయాలు చేస్తోందని జమ్మికుంట మాజీ జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్ శ్యామ్ విమర్శించారు. మంగళవారం ఆయన తన ఆఫీసులో మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో నాణ్యత లోపించిందని పీసీ ఘోష్ కమిషన్ పేర్కొందన్నారు. కమిషన్ చైర్మన్ ఇచ్చిన సమాచారాన్ని దాస్తూ ఎంపీ ఈటల రాజేందర్ పై కాంగ్రెస్ నాయకులు కావాలని దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కావాలని ఈటల రాజేందర్ ను బదనాం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీసీ నాయకుడిగా రాజేందర్ ఎదుగుదల ఓర్వలేక కొంతమంది రాజకీయ నాయకులు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోయిని నారాయణ, అల్లం విజయ్, అమర్, పున్న%శీ% చందర్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రిని కలిసిన జనసేన నాయకులు



**వేద న్యూస్, పార్వతిపురం మన్యం ప్రతినిధి:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి శ్మనోహర్ మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటించారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పార్వతీపురం జిల్లా జనసేన నాయకులు అవనాపు విక్రమ్ అనంతగిరి మండలం హరిత రిసార్ట్స్ లో మంగళవారంసాయంత్రం మంత్రి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లాలోని జనసేన పార్టీని బలోపేతం చేసుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలు, భవిష్యత్ కార్యాచరణ పై వారు చర్చించారు.



# మరీ ఇంత నిర్లక్ష్యమా..!

కోలాకిరణ్, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకర రావు తదితరులు తదితరులు పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి / సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవను కలిసి గత జూన్ నెల నుండి జిల్లా ఆస్పత్రిలో రేడియాలజీ (స్కానింగ్) డాక్టర్ లేరన్న విషయాన్ని గుర్తు చేశారు. దీనివలన ప్రతిరోజు రేడియాలజీ స్కానింగ్ అవసరమయ్యే దాదాపు 80 నుండి 100 మంది వరకు రోగులు అగచాట్లు పడుతున్నారన్నారు. ఇందులో అధికంగా గిరిజన రోగులే ఉంటున్నారన్నారు. స్కానింగ్ కోసం బయట ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లకు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని, వాటిని భరించలేకపోతున్నామని రోగులు తమ వద్ద వాపోయినట్లు పేర్కొన్నారు. జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న రేడియాలజీ డాక్టర్ జయరామ్ ను సాలూరు కు బదిలీతో వేధించడంతో ఆయన ఉద్యోగాన్ని మానేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. గతంలో కూడా రేడియాలజీ డాక్టర్ కిషోర్ ను కూడా సాలూరు బదిలీ చేసి వేధించడంతో ఆయన కూడా ఉద్యోగానికి స్వస్తి పలికినట్లు తమకు తెలిసిందన్నారు. జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న రేడియాలజీ డాక్టర్లపై కక్షగట్టి ఇలా వేధింపులకు గురి చేయడం వల్లే, ఆయా డాక్టర్లు అటు సాలూరు వెళ్లక ఇక్కడ జిల్లా ఆస్పత్రిలో పనిచేయక ఉద్యోగాలు వదులుకుంటున్నారన్నారు. దీనివలన డాక్టర్ల కంటే రోగులకే ఎక్కువగా నష్టం జరుగుతుందన్నారు. ఈ రకమైన అనాలోచిత బదిలీ వేధింపులు సరికాదన్నారు. రోజుకు 100 మంది వరకు రోగులకు స్కానింగ్ అవసరమయ్యే జిల్లా ఆసుపత్రి నుండి 10 స్కానింగ్ లు కూడా అవసరం ఉండని సాలూరు ఆసుపత్రికి రేడియాలజీ డాక్టర్లను బదిలీ చేయటం జిల్లా ఆస్పత్రి పై నిర్లక్ష్యం చూపటమే అని ఆరోపించారు. అంతేకాకుండా కాంట్రాక్ట్ బేసిస్ లో పనిచేస్తున్న డాక్టర్ను బదిలీ చేయటం మరి విడ్డూరంగా ఉందన్నారు. తక్షణమే దీనిపై తగు చర్యలు తీసుకొని ఒకటి రెండు రోజుల్లో జిల్లా ఆస్పత్రిలో రేడియాలజీ స్కానింగ్ డాక్టర్ను నియమించాలని వారు కోరారు. జిల్లా ఆస్పత్రిలోని రోగులకు ముఖ్యంగా గిరిజన రోగులకు స్కానింగ్ ఆగచాట్లు లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. తక్షణమే చర్యలు తీసుకుంటామని పిఓ హామీ ఇచ్చారన్నారు.

# విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

**- వామపక్ష ప్రజా సంఘాలు డిమాండ్ - పార్వతీపురం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా - ఆర్టిసి కాంప్లెక్స్ నుంచి ర్యాలీ, ఈఈకు వినతి**

**వేద న్యూస్, పార్వతిపురం మన్యం ప్రతినిధి :**

రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా బిగిస్తున్న ఆదాని స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని, ప్రజలు దానిని తీవ్రంగా వ్యతిరేకించాలని వామపక్ష ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పార్వతీపురం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. మొదటగా ఆర్టిసి కాంప్లెక్స్ నుండి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎలక్ట్రికల్ ఈఈను బయటకు పిలిపించి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్తు రూపంలో మరో రూ. 12,717 కోట్ల చార్జీల బాదుడుకు రంగం సిద్ధంగా కూటమి పాలనలో ఉందని అన్నారు. ఏడాదిలో 30 వేల కోట్ల రూ. విద్యుత్ భారం అదానీ స్మార్ట్ మీటర్లతో ప్రజలను శాశ్వత దోపిడీ పాల్పడుతున్నారని, మాట తప్పి మోసం చేసిన కూటమి సర్కార్ మోడీ, అదానీ, స్మార్ట్ మీటర్లు, విద్యుత్ సోలార్ విద్యుత్ ఒప్పందాలలో వైసిపి అవినీతిని కాపాడుతున్న కూటమి నేతలు అనేక అపోహాలతో ప్రజలను మభ్యపెడుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ బారాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం మాట తప్పి దగా చేసిందని, సూపర్ సిక్స్ హామీలు నత్తనడగా సాగుతుండగా, భారాలు వేగంగా వేస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వం మోడీ ఆదేశాలకు తలోగ్గి కార్పొరేట్ యజమాని స్మార్ట్ మీటర్ల విధానాన్ని అమలుచేసిందని, ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న విద్యుత్ బారాలను నిరసిస్తూ స్మార్ట్ మేటర్ ను బిగిస్తే బద్దలు కొట్టండి మీకు నేను అండగా ఉంటానని స్వయంగా నారా లోకేష్ పిలుపునిచ్చారని, నేడు అందుకు విరుద్ధంగా గత ప్రభుత్వ విధానంలోనే నేటి కూటమి ప్రభుత్వం నడుస్తుందని విమర్శించారు. ఆదాని స్మార్ట్ మీటర్లు బిగించడానికి ఎవరైనా వస్తే ప్రజలందరూ స్మార్ట్ మీటర్ల బిగించడాన్ని వ్యతిరేకించాలని నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, రైతుకూలి సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు పోల ఈశ్వరరావు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పి.సంగం, రైతు కూలి సంఘం నాయకులు పి.శ్రీనునాయుడు, బి.భాషా, సిఐటియు నాయకులు బి.సూరిబాబు, బి.లక్ష్మి, ఐఎఫ్టియు నాయకులు జి.సర్వేసురావు, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు పి.రాము, బలరాం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, ఏపి రైతు సంఘం నాయకులు ఈ.వి.నాయుడు, ఐద్వా నాయకులు జి.తులసి, ఎం.గౌరి, బి.జయమ్మ, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పాకల సన్యాసిరావు, ఎస్.ఉమా, ఎస్ఎఫ్ఐ నాయకులు టి.అఖిల్, సిహెచ్.సింహాచలం, డివైఎఫ్ఐ నాయకులు పి.రాజశేఖర్, పిడిఎస్ఓ నాయకులు సోమేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు బి.రవికుమార్, ఎఐవైఎఫ్ నాయకులు బి.టి.నాయుడు, రైస్ మిల్ యూనియన్ నాయకులు జి.కృష్ణ, షాపు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు చొక్కాకు మౌళి మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# జూనియర్ కాలేజీలో వసతులు కల్పించాలి

**- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గంగాధర కళాశాల సందర్శన**

**వేద న్యూస్, గంగాధర:**

గంగాధర మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య కోరింది. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం జూనియర్ కళాశాలను నాయకులు సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. సరిపడా తరగదులు లేక విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని కళాశాల ప్రాంగణంలో చుట్టూ ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీంబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వర్షాకాల నేపథ్యంలో తరగతి గదులు సరిపోక విద్యార్థులు అనేక అవస్థలు పడుతూ విద్యార్థులు కళాశాలకు వస్తున్నారని వెల్లడించారు. సర్కారు సమస్యలను పరిష్కరించకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో అనేక ఉద్యమాలకు నాంది పలుకుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేష్, మండల నాయకులు క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# వరంగల్ కలెక్టర్ ఆఫీస్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

వరంగల్ జిల్లా ఏర్పడి ఎనిమిది సంవత్సరాలు, అవుతున్నప్పటికీ నేటి వరకు వరంగల్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయంతో సహా ఇతర ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు జరగకపోవడం శోచనీయమని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న కలెక్టర్ ఆఫీస్ నిర్మాణం సత్వరమే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . మంగళవారం ఖిలా వరంగల్ పెట్రోల్ పంప్ ఏరియాలో నగర నాయకులు బండి కుమార్ అధ్యక్షతన జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆయా జిల్లాల కేంద్రంలో కలెక్టర్ ఆఫీసులు ఏర్పాటు చేయబడి పనిచేస్తున్నాయని అలాగే వరంగల్ ఉమ్మడి జిల్లాను విభజించి ఐదు జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేశారని వరంగల్ కేంద్రంలో మాత్రం ఇంతవరకు ఒక్క ప్రభుత్వ కార్యాలయం కూడా ఏర్పాటు చేయలేదని ఆయన విమర్శించారు. జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్నటువంటి నల్లబెల్లి నెక్కొండ రాయపర్తి మండలాలకు చెందిన గ్రామ ప్రజలు వారి సమస్యలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావడానికి నేటికీ హనుమకొండ జిల్లాలో ఉన్నటువంటి వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయముకు రావడానికి చాలా కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు.

జిల్లాలో 13 మండలాల్లో ప్రస్తుతం 180 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని ఇటీవల ఏర్పాటు చేయబడ్డ నూతన గ్రామ పంచాయతీలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించి నూతన మండలాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. జిల్లాలో వరంగల్ నర్సంపేట రెండు రెవెన్యూ డివిజన్లు మాత్రమే ఉన్నాయని హనుమకొండ జిల్లాలో ఉన్న అయినవోలు మండలాన్ని వరంగల్ జిల్లాలో కలిపి వర్ధన్నపేట అయినవోలు రాయపర్తి పర్వతగిరి మండలాలతో వర్ధన్నపేటను రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. జిల్లాకు చెందిన రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ నగరానికి చెందిన ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మరియు ఇదే జిల్లాకు చెందిన స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి లు చొరవ తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, ఐఎఫ్ టియు నగర అధ్యక్ష కార్యదర్శులు బన్న నర్సింగం, ఎర్ర జయబాబు,నాయకులు మహమ్మద్ ఖాన్, భాస్కర్, గంద్రతి హరిబాబు, వీరన్న లతోపాటు పార్టీ ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.




# 'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటుతాం

## - మాజీ మంత్రి రెడ్యానాయక్

**వేద న్యూస్, మరిపెడ:**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలిచి సత్తా చాటుతుందని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి రెడ్యా నాయక్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మరిపెడ మండల కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీని బదనాం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. కాళేశ్వరం కమిషన్ కాంగ్రెస్ పార్టీ కమిషన్ గా పనిచేసిందని ఆరోపించారు.

పీసీ ఘోష్ కాంగ్రెస్ కార్యకర్తలాగ పనిచేసి.. కాంగ్రెస్ లీడర్లు మాట్లాడిన విషయాలనే రిపోర్టులో పొందుపరిచారని ధ్వజమెత్తారు. కేసీఆర్ ఆధ్వర్యంలో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ను నీరు గార్చి లక్ష ఎకరాలను ఎండ బట్టే కుట్రకు తెర లేపారని ఆరోపించారు. తెలంగాణ రైతాంగం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన 420 హామీల అమలు సర్కారు ఎప్పుడు అమలు చేస్తుందని ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పి అధికారంలో కి వచ్చి బీసీలను మభ్య పెట్టే విధంగా హస్తం పార్టీ ఢిల్లీలో ధర్నా లు అంటూ నాటకాలు చేస్తున్నదని విమర్శించారు. గ్రామ పంచాయతీలకు గత ప్రభుత్వం ఇచ్చిన ట్రాక్టర్ లకు డీజిల్ లేక కలెక్టర్ లు స్వాధీన పరుచుకొని దుస్థితికి తీసుకొచ్చారని వెల్లడించారు. ప్రతి పనికి 10శాతం కమీషన్ వసూళ్లు చేసేది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.





# పోచమ్మ తల్లికి మకర తోరణం అందజేత

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండలో నూతనంగా ప్రతిష్టించిన పోచమ్మ అమ్మవారి కి మంగళవారం రేగూరి శోభారాణి రవీందర్ దంపతులు రూ.20 వేలు విలువ గల మకర తోరణం,గంట అందజేశారు. సాగర్ పంతులు పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి అలంకరించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈకార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళలు, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

# మహిళ పట్ల అసభ్యకరంగా వ్యవహరించిన వ్యక్తి రిమాండ్




వేములవాడ రూరల్ ఎస్సై అంజయ్య

**వేద న్యూస్, వేములవాడ:**

వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామానికి చెందిన హుస్సేన్.. ఓ మహిళ పట్ల అసభ్యకరంగా వ్యవహరించడం, వీడియో తీయుటకు ప్రయత్నం చేశాడు. ఈ మేరకు ఫిర్యాదు రాగా కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్టు వేములవాడ రూరల్ ఎస్ ఐ అంజయ్య మంగళవారం తెలిపారు. ఈ మహిళల పట్ల అసభ్యకరం గా వ్యవహరించినా, మహిళలను శారీరకంగా, మానసికంగా హింసించినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం అని తెలిపారు. మహిళ లు వారిపై జరుగుతున్న చర్యలను మౌనంగా భరించవద్దు అని, ధైర్యం గా ముందు కు వచ్చి సంబంధిత పోలీస్ స్టేషన్లలో కానీ జిల్లా షీ టీమ్ కి కానీ కంప్లయింట్ చేయాలని సూచించారు.

# అమర్‌నాథ్ యాత్ర విధుల్లో ఉన్న అధికారులు తిరిగి రావాలని ఆదేశాలు

**వేదన్యూస్ డెస్క్ :**

జమ్మూ కాశ్మీర్ కు రాష్ట్ర హోదా మంజూరు చేయడంపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఇంతలో జమ్మూలో అమర్ నాథ్ యాత్ర విధుల్లో ఉన్న అధికారులను తిరిగి రావాలని కోరారు. అమర్ నాథ్ యాత్ర చేసే భక్తుల కోసం ఏర్పాటు చేసిన ప్రధాన సౌకర్యాల కేంద్రాల నుంచి అధికారులను, ఉద్యోగులను జమ్మూ జిల్లా యంత్రాంగం తొలగించింది. భగవతి నగర్ లో ఉన్న యాత్రి నివాస్ బేస్ క్యాంప్, పురాని మండిలో ఉన్న రామ్ మందిర్, పరేడ్ లో ఉన్న గీతా భవన్ అధికారులకు ఈ నిర్ణయం తక్షణమే వర్తిస్తుంది. అందరూ అసలు పదవులకు తిరిగి రావాలని ఆదేశించారు. 'అమర్‌నాథ్ యాత్ర 2025 కోసం మోహరించిన అధికారులకు సంబంధించిన అన్ని ఉత్తర్వులను రద్దు చేసింది. ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్ట్ చేయబడిన అధికారులు, ఉద్యోగులు ఈ ఆదేశాల ప్రకారం తక్షణమే ఉపశమనం పొందనున్నారు. ఇందులో జమ్మూలోని భగవతి నగర్‌లోని యాత్రి నివాస్ బేస్ క్యాంప్, పురానీ మండిలోని రామ్ మందిర్, పరేడ్‌లోని గీతా భవన్ ఉన్నాయి' అని పరిపాలన తన అధికారిక ప్రకటనలో తెలిపింది. అంతేకాదు అందరు అధికారులు, ఉద్యోగులు తమ రెగ్యులర్ పనిని తిరిగి ప్రారంభించడానికి వారి అసలు పోస్టింగ్ స్థలానికి రిపోర్ట్ చేయాలని సూచించారు. ఏవిధంగా ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయంటే అదే సమయంలో పిడిపి అధినేత్రి మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా ముఫ్తీ ట్వీట్ చేయడంతో జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వడం గురించి ఊహాగానాలు తీవ్రమయ్యాయి. ఆమె 'సరిగ్గా ఆరు సంవత్సరాల క్రితం, ఆగస్టు 4, 2019న, కాశ్మీర్‌పై భయంకరమైన అనిశ్చితి మేఘం కమ్ముకుంది. ఒక వారం పాటు అణచివేసిన గుసగుసలు మళ్ళీ ఏదో పెద్ద విషయం జరగబోతోందని చెబుతున్నాయని ట్వీట్ చేసింది.

జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఏం చెప్పారు? అయితే జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఈ విషయంపై మాట్లాడుతూ.. జమ్మూ కాశ్మీర్‌లో మంగళవారం ఏమి జరగబోతోందనే దాని గురించి నేను అనేక విషయాలు విన్నాను. అయితే మంగళవారం ఏమీ జరగదని నేను నిజాయితీగా చెబుతాను.

వేద న్యూస్

బుధవారం ఆగస్టు 06, 2025

# సంపాదకీయం

జలహక్కులపై ఉమ్మడి కుట్రలు

అరువై ఏండ్ల పాటు ఉమ్మడి పాలకులు నీళ్లు ఇవ్వకనే తెలంగాణ వాకిలి పొక్కిలైంది. తలాపున పారే కృష్ణా, గోదావరి నీళ్లు తెలంగాణ బీళ్లను తడపకుండా, ఈ గడ్డపై నిలవకుండా.. పడ్డ చినుకు పడ్డట్టుగా తరలించుకుపోయిన కుట్రల ఫలితంగానే తెలంగాణ వలసబాట పట్టింది. కరువుకు.. రైతన్నల ఆత్మహత్యలకు నెలవైంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల్లో నదీజలాల హక్కులు ప్రధానంగా నిలిచాయి. ఉద్యమనేత కేసీఆర్ సారథ్యంలో సీమాంధ్ర పాలకుల జల కుట్రలను బట్టబయలు చేసి, కాలరాయబడిన హక్కులను అవిశ్రాంత పోరాటంతో తెలంగాణ తిరిగి సాధించుకున్నది. చెరువుల పూడిక తీసుకున్నది. మూలకుపడ్డ ప్రాజెక్టులను పట్టాలెక్కించింది. కృష్ణమ్మ, గోదారమ్మను ఒడిసిపట్టింది. మొత్తంగా పదేండ్ల స్వరాష్ట్రంలో జల ఫలాలను తెలంగాణ పల్లె అనుభవించింది. నీటి వాటాలను పూర్తిగా వినియోగించుకునే ప్రణాళికలను సిద్ధం చేసుకున్నది. రాష్ట్రం ప్రగతిపథంలో పరుగులు తీస్తున్న వేళ మళ్లీ ఇప్పుడు ఉమ్మడి కుట్రలకు తెరలేచింది. తెలంగాణ జల హక్కులను కబళించే పన్నాగాలకు పదునెక్కింది. దాని పేరే పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు. సూత్రధారి ఏపీ సీఎం చంద్రబాబు, పాత్రధారి కేంద్రంలోని బీజేపీ. ప్రేక్షకుడు రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు సారథి రేవంత్‌రెడ్డి. 'ఏపీ అన్నింటికన్న దిగువనున్న రాష్ట్రం. ఏటా సముద్రంలోకి 3 వేల టీఎంసీలు వృథాగా పోతున్నాయి. అందులో నుంచి 200 టీఎంసీల వరద జలాలనే బనకచర్లకు మళ్లించి రాయలసీమకు అందిస్తాం.' ఇదీ ఏపీ చెప్తున్న మాట. కానీ, వరద ఎక్కడి నుంచి వస్తున్నది? ఎందుకు పోతున్నది? మళ్లింపు వల్ల వచ్చే నష్టమేంటి? అన్నవే అసలు ప్రశ్నలు. మొదటగా వరద ఎక్కడిదో తెలుసుకుందాం. బచావత్ ట్రిబ్యునల్ గోదావరి బేసిన్‌ను 12 సబ్‌బేసిన్లుగా విభజించింది. ఆ తర్వాత 75 శాతం డిపెండబులిటీ అంటే కనీసం నాలుగేండ్లలో మూడేండ్ల పాటు కచ్చితంగా వచ్చే వరద ప్రవాహాలు. ఆ ప్రకారం గోదావరిలో ఏటా ఎంత నీరు అందుబాటులో ఉంటుందో లెక్కగట్టింది. ఆ జలాలన్నింటినీ బేసిన్‌లోని ఉమ్మడి ఏపీతో పాటు, పూర్వ మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, కర్ణాటక రాష్ట్రాలకు వాటి వాటి పరీవాహక ప్రాంతం ఆధారంగా పంపిణీ చేసింది. 2023లో సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) గోదావరిలో ఎంత నీరుందనే దానిపై అధ్యయనం చేసింది. ఆ గణాంకాలు తేల్చిందేమంటే 75 శాతం డిపెండబులిటీపై గోదావరిలో నీటిలభ్యత 3,396.9 టీఎంసీలు.

50 ఏండ్ల సగటు నీటి లభ్యత 4,535.1 టీఎంసీలు. ఈ లెక్కన మిగులుతున్నది 1138.2 టీఎంసీలు. వాస్తవంగా ఇది మిగులు కాదు. ఇవి బేసిన్‌లోని రాష్ట్రాలు వినియోగించుకోని నికరజలాలే. ఉమ్మడి ఏపీకి ట్రిబ్యునల్ 1,486 టీఎంసీలను కేటాయించింది. అందులో తెలంగాణ వాటా 968 టీఎంసీలు, ఏపీ వాటా 531 టీఎంసీలు. అయితే, రాష్ట్ర ఏర్పాటు నాటికీ తెలంగాణ తన వాటాలో కనీసం 200 టీఎంసీలను కూడా వినియోగించుకోని దుస్థితి. అలాగే ఛత్తీస్‌గఢ్ కూడా తన వాటా 400 టీఎంసీలను ఇప్పటికీ వినియోగించుకోవడం లేదు. మహారాష్ట్ర కూడా అంతే. అందుకే గోదావరిలో వరద కనిపిస్తున్నది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ నీటి నిల్వ సామర్థ్యం పెంచుకున్నది. కాళేశ్వరం ద్వారానే 141 టీఎంసీల రిజర్వ్ కెపాసిటీ పెరుగగా, 400 టీఎంసీలకు పైగా వినియోగించుకునే వ్యవస్థలను ఏర్పాటుచేసుకుంది. ఇవికాకుండా సమ్మక్కసాగర్ 44, సీతమ్మసాగర్ 67 టీఎంసీలు మొత్తంగా నికర వాటాలో 824 టీఎంసీలను వినియోగించుకునేలా ప్రణాళికలను సిద్ధం చేసింది. భవిష్యత్తు అవసరాల కోసం ఒక 144 టీఎంసీలను రిజర్వ్ చేసి పెట్టుకున్నది. ఛత్తీస్‌గఢ్ కూడా ఇటీవల సుబోధ్‌ఘాట్ ద్వారా 90 టీఎంసీలు, మహానది-ఇంద్రావతి లింక్ ద్వారా 150 టీఎంసీలను వినియోగించుకునేలా ప్రాజెక్టులను రూపకల్పన చేసుకున్నది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఈ ప్రాజెక్టులన్నింటి ద్వారా నీటి వినియోగం పెరిగితే ఆ మేరకు జలాలు దిగువకు పోవన్నది కండ్లముందు కనబడుతున్న సత్యం. వరద మాటున ఏపీ జలాల వినియోగానికి అంగీకరిస్తే తెలంగాణకే కాదు, బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీనే కండ్లముందు కనబడుతున్న సజీవ సాక్ష్యం. రేపటి రోజున బనకచర్ల కూడా మరో పోతిరెడ్డిపాడులా మారుతుంది. బనకచర్ల ద్వారా ఒక్క గోదావరినే కాదు, కృష్ణా జలాలను కబళించేందుకు ఏపీ ప్రణాళికను సిద్ధం చేసుకున్నది. సాగర్ కుడికాలువ 80 కిమీ వద్ద బొల్లాపల్లి రిజర్వాయర్‌ను కట్టనున్నది. బనకచర్ల ద్వారా ఇటు గోదావరి, అటు కృష్ణా జలాలు తెలంగాణకు దక్కకుండాపోయే ప్రమాదం ఉన్నది. అదీగాక ఏపీ ఇప్పటికే గోదావరి ట్రిబ్యునల్ కోసం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది.

# మణిపూర్‌లో మరో ఆరు నెలలు రాష్ట్రపతి పాలన

**వేదన్యూస్, న్యూఢిల్లీ :**




ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు పొడిగించేందుకు మార్గం సుగమం అయింది. ఇవాళ (మంగళవారం) రాజ్యసభ ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ ఉదయం, ప్రతిపక్షాల తీవ్ర నినాదాల మధ్య కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తీర్మానాన్ని ఎగువ సభ(రాజ్యసభ)లో ప్రవేశపెట్టారు. '2025 ఫిబ్రవరి 13న రాష్ట్రపతి రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 కింద జారీ చేసిన మణిపూర్‌కు సంబంధించి ప్రకటన అమలులో కొనసాగింపు' అనే చట్టబద్ధమైన తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఇప్పటికే జూలై 30న, మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించేందుకు లోక్‌సభ తీర్మానాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే. ఎన్ బిరేన్ సింగ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన కొన్ని రోజుల తర్వాత, ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించారు. దాదాపు రెండు నెలలుగా రాష్ట్రాన్ని పీడిస్తున్న హింస, రాజకీయ అస్థిరత మధ్య సింగ్ రాజీనామా చేశారు. దీంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 కింద అమలులోకి వచ్చే ఈ నిర్ణయం ప్రకారం.. రాష్ట్రపతి ఇప్పుడు గవర్నర్ ద్వారా మణిపూర్ రాష్ట్ర పరిపాలనా విధులను నేరుగా నియంత్రిస్తారని అర్థం.

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన భారత గెజిట్‌లో ప్రచురించబడిన ఈ ప్రకటన, మణిపూర్ శాసనసభ అధికారాలను పార్లమెంటుకు బదిలీ చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ అధికారాన్ని సమర్థవంతంగా నిలిపివేస్తుందని పేర్కొంది. ఈ ఉత్తర్వు ప్రకారం, గవర్నర్ అధికారాలను ఇప్పుడు రాష్ట్రపతి ఉపయోగిస్తారు. రాష్ట్ర శాసనసభ అధికారాన్ని పార్లమెంటు స్వీకరిస్తుంది. రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయలేనప్పుడు సాధారణంగా రాష్ట్రపతి పాలన విధిస్తారు. రాష్ట్రపతి పాలన విధించడం పార్లమెంటరీ ఆమోదానికి లోబడి ఆరు నెలల వరకు ఉంటుంది. ఈ కాలంలో, కేంద్ర ప్రభుత్వం పాలనను పర్యవేక్షిస్తుంది. కొత్త అసెంబ్లీని ఎన్నుకోవడానికి కొత్తగా ఎన్నికలు జరగవచ్చు. మణిపూర్‌లో జరిగిన అశాంతిలో ప్రధానంగా మెజారిటీ మెయిటీ కమ్యూనిటీ, మైనారిటీ కుకి-జోమి తెగల మధ్య ఘర్షణలు జరిగాయి. ఆర్థిక ప్రయోజనాలు, ఉద్యోగ కోటాలు ఇంకా భూమి హక్కులకు సంబంధించిన వివాదాలపై ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ హింస వందలాది మంది మరణానికి దారితీసింది. సుమారు 60,000 మంది నిరాశ్రయులయ్యారు.

# హస్తం పార్టీ రైతు పక్షపాతి

**వేద న్యూస్, మెట్‌పల్లి:**



హస్తం రైతులకు నేస్తం అని, కాంగ్రెస్ పార్టీ రైతు పక్షపాతి అని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ డెలిగెట్ సుజిత్ రావు ఆదేశాలతో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ స్టేట్ కోర్డినేటర్ వాకిటి సత్యం, పార్టీ శ్రేణులతో కలిసి మంగళవారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. కోరుట్ల నియోజకవర్గంలో ప్రతిపక్ష నాయకులు యూరియా మీద అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రానికి యూరియా పంపిణీ బాధ్యత పూర్తిగా కేంద్ర ప్రభుత్వానిదేనని,దీనిపై కనీసం అవగాహన లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే యూరియా కొరత ఏర్పడ్డదని మాట్లాడడం భావ్యం కాదని వెల్లడించారు. షుగర్ ఫ్యాక్టరీ విషయంలో పాదయాత్ర చేసిన విషయం కేంద్ర ప్రభుత్వ ఎంపీ అరవింద్ కు కనబడట్లేదా అని అడిగారు. పసుపు బోర్డు కార్యాలయం నిజామాబాద్ లో ఏర్పాటుకు సహకరించి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కేటాయించిన ఘనత రేవంత్ రెడ్డిది అని చెప్పారు. రైతులు సంయమనం పాటిస్తే ప్రతి ఒక్కరికీ యూరియా అందే విధంగా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఈ సంవత్సరం మార్చ్, ఏప్రిల్‌లో వడగండ్ల వానకు పంట నష్టం జరిగిందని సీఎం రేవంత్ దృష్టికి తీసుకువెళ్లడంతో.. జగిత్యాల జిల్లాకు రూ.51 కోట్లు కేటాయించారని చెప్పారు. త్వరలోనే మంత్రుల సమక్షంలో రైతులకు అందజేస్తామని ప్రకటించారు.

# సమస్యలపై ఎమ్మెల్యే గాంధీకి వినతి

**వేద న్యూస్, ఆల్విన్ కాలనీ:**

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్-1 కాలనీవాసులు పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని మంగళవారం కలిశారు. వివేకానందనగర్ లోని వారి ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. సమస్యల పరిష్కారంపై గాంధీ సానుకూలంగా స్పందించినట్టు కాలనీవాసులు వెల్లడించారు. వారు మాట్లాడుతూ.. కాలనీలో మౌలిక వసతులు కలిపించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అదేవిధంగా కాలనీలలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పర్చాలని కోరారు. అవసరమున్న చోట యూజీడీ పైప్ లైన్లు వేయాలని, విధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. గాంధీ మాట్లాడుతూ.. త్వరలోనే ఆల్విన్ కాలనీ ఫేస్-1 కాలనీలో పర్యటిస్తానని చెప్పారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడిం చారు. కార్యక్రమంలో ఆల్విన్ కాలనీ ఫేస్-1 కాలనీ ప్రెసిడెంట్ వెంకటేశం గౌడ్, జనరల్ సెక్రెటరీ కుమారచారి, జాయింట్ సెక్రెటరీ రఘు, కల్చరల్ సెక్రెటరీ హేమలత, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.




# పెట్టుబడి పేరుతో వీసాలకు క్యూ కడుతున్న భారతీయులు

**వేదన్యూస్ డెస్క్:**

అమెరికాలో సెటిల్ కావాలనుకున్న భారతీయులకు ట్రంప్ షాకుల మీద షాకులు ఇస్తుండగా.. భారతీయులు మాత్రం లోనే ఇన్వెస్ట్‌మెంట్ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. పెట్టుబడి పేరుతో పొందే వీసాలకు క్యూ కడుతున్నారు. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు అయ్యాక.. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా.. అమెరికాలో పెట్టుబడులు పెట్టేందుకు మాత్రం భారతీయులు వెనకడుగు వేయడం లేదు. ఉద్యోగాలకు అవసరమైన హెచ్1బీ వీసాలు రావడం కష్టంగా మారినా.. వ్యాపారానికి అవసరమైన ఈబీ-5 వీసాలకు మాత్రం డిమాండ్ తగ్గలేదని లెక్కలు చెబుతున్నాయి. ఈబీ-5 దరఖాస్తుల డేటాను పరిశీలిస్తే.. గతంలో ఎన్నడూ లేనంతగా భారతీయులు ఇందుకోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. 2024 ఏప్రిల్ నుంచి భారతీయుల్లో ఈబీ-5 వీసాకు ఆదరణ పెరిగింది. యునైటెడ్ స్టేట్స్ ఇమిగ్రేషన్ ఫండ్ డేటా ప్రకారం.. 2025 ఆర్థిక సంవత్సరంలో



భారతీయుల నుంచి 12వందలకు పైగా ఈబీ-5 పిటిషన్లు వచ్చాయంటున్నారు అధికారులు. ఇతర రకం వీసాల జారీలో పెద్ద సంఖ్యలో బ్యాక్‌లాగ్ ఉండటంతో ఈబీ-5కు డిమాండ్ పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా హెచ్1బీ, గ్రీన్‌కార్డ్‌ల జారీ కష్టంగా మారడం కూడా దీనికి కారణమైంది. ఇప్పటివరకు ఇమిగ్రేషన్ సంస్థ దగ్గర దాదాపు కోటి 10లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈనేపథ్యంలో వేగంగా లభించే ఈబీ-5ను అమెరికా శాశ్వత నివాసానికి మార్గంగా ఎంచుకుంటున్నారు భారతీయులు. వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే 'ఇన్వెస్ట్ ఇన్ ది యూఎస్ఏ' సంస్థ లెక్కల ప్రకారం 2024లో భారతీయులకు 14వందల 28 ఈబీ-5 వీసాలను జారీ చేశారు. 2023లో ఈ సంఖ్య కేవలం 815 మాత్రమే ఉంది. ఈబీ-5 వీసాలను.. ట్రంప్ ప్రకటించిన విధంగా.. గోల్డ్ కార్డులతో భర్తీ చేయనుండటంతో డిమాండ్ ఇంకాస్త పెరిగినట్లు తెలుస్తోంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073